

కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదానికి పిలుపు

కాకినాడ రూరల్: నేడు కలెక్టరేట్ వద్ద కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కమిటీ పిలుపునిచ్చింది. సోమవారం ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలం కన్వీనర్ టి.రాజా మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ముందు దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు పదేళ్ల క్రితం పెట్టిన 15 డిమాండ్లలో ఏ ఒక్క డిమాండ్‌ను అమలు చేయలేదన్నారు. వివిధ డిమాండ్ల సాధన కోసం నేడు కలెక్టరేట్ వద్ద జరుగుతున్న ధర్నాలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, చింతపల్లి అజయ్‌కుమార్, క్లస్టర్ కమిటీ నాయకులు సత్యనారాయణ, శ్రీహరి, బలరాం, సంగీతరావు, శ్రీను, నూకరాజు, దుర్గాప్రసాద్, రాంబాబు, సురేష్, కాట బాబు, శ్రీనివాసు పాల్గొన్నారు.

మోత... రోత

- పరిమితి మించుతున్న వాహన శబ్దాలు
- విచిత్రమైన హారన్లతో బైకులపై ఆకతాయిల ఆగడాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టణ కేంద్రాల్లో జనావాసాల మధ్య వాహనాల శబ్దం హద్దులు మీరుతోంది. కొంతమంది యువత విచిత్ర హారన్ లు వినియోగించడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనాలనుంచి ఆటోల వరకు కొందరు ఆకతాయిల చేష్టలవల్ల ప్రజలు హడలెత్తుతున్నారు. పిల్లి అరుపు నుంచి పిల్లాడి ఏడుపు వరకు.. కుక్క మొరిగినట్టు, నక్క మూలిగినట్టు, పులి గాండ్రించినట్టు ఇలా ఒకటేంటి రకరకాల హరన్‌లు, విసిగిపోయే సైరన్లతో ఆకతాయిలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. నిత్యం జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో విచిత్రమైన శబ్దాలు చేస్తూ జనాన్ని విసిగిస్తున్నారు. జనంలో బుల్లెట్‌పై మక్కువ తెలిసిందే. వాస్తవానికి బుల్లెంట్ బండి కంపెనీతో వచ్చే సైలెన్సర్‌లో శబ్దస్థాయి చాలా తక్కువగా ఉంటుంది. కానీ వాటిని కొనుగోలు చేసినవారిలో చాలామంది తర్వాత భారీ శబ్దం వచ్చే సైలెన్సర్‌లు అమర్చుతున్నారు. వాహనాల నుంచి పరిశ్రమల వరకు శబ్దానికి సంబంధించి పరిమితులు ఉన్నప్పటికీ అధికారులు వాటిని పట్టించుకోకపోవడం, ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో ఎవరికి వారు ఇష్టారీతిన శబ్దకాలుష్యానికి కారకులుగా మారుతున్నారు.



ట్రాఫిక్ పోలీసుల స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లు

పర్యావరణ పరిరక్షణ నిబంధనల ప్రకారం ప్రతి వాహనానికి పలు పర్యావరణ నిబంధనలు ఉన్నాయి. 1986 పర్యావరణ నిబంధనల ప్రకారం ద్విచక్రవాహనం నుంచి ట్రాక్టర్ వరకు ప్రతి మోటారు వాహనానికి శబ్ద నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే. సైలెన్సర్ తప్పనిసరిగా ఉండాలి. వాహనం తీసుకున్న ఆరు నెలల వరకు 90 డెసిబుల్స్ బైస్టాండర్స్ పోజిషన్, 100 డెసిబుల్స్ ఆపరేటర్ లెవల్స్ ఉండాలి. రెండున్నర సంవత్సరాల తర్వాత 88 డెసిబుల్స్ బైస్టాండర్స్ పొజిషన్, 98 డెసిబుల్స్ ఆపరేటర్ లెవెల్స్ ఉండాలి. కానీ కొందరు ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టం వచ్చినట్టుగా వాహనాలకు సైలెన్సర్లు మారుస్తూ శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారు.

ఆటోవాలాలు తమకు నచ్చిన హారన్ వాడుతున్నారు. అంతేకాకుండా కొందరు ఆటోవాలాలు నిబంధనలకు విరుద్ధంగా తమ ఆటోల్లో మ్యూజిక్ స్పీకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో జనవాసాలు మధ్యనే కొన్ని పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. వాటి నుంచి వచ్చే శబ్దాలతో ఆయా ప్రాంతాల్లోని గృహాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సదరు పరిశ్రమల నిర్వాహకుల నుంచి కొందరు అధికారులకు మామూళ్లు వెళ్తున్నాయనీ, అందువల్లనే అలాంటివాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శబ్ద స్థాయి ఉండాలిలా...

వాహనాల వారీగా వచ్చే శబ్దాల స్థాయివాహనం శబ్దస్థాయి (డెసిబుల్స్‌లో)మోటారు వాహనాలు త్రీవీలర్స్ 80పాసింజర్, కార్లు 82పాసింజర్, కమర్షియల్ వాహనాలు(4 ఎంటీ వరకు) 85పాసింజర్, కమర్షియల్ వాహనాలు(4 నుంచి 12ఎంటీ వరకు) 89పాసింజర్, కమర్షియల్ వాహనాలు(12 ఎంటి కంటే ఎక్కువ) ఉండాలి. 91 రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిబంధనల ప్రకారం ప్రాంతాల వారీగా శబ్దం ఉండాల్సిన డెసిబుల్ స్థాయి...పారిశ్రామిక ప్రాంతంలో 75.00 నుంచి 70.00 ఉండాలి. వాణిజ్య ప్రాంతంలో 65.00 55.00 డెసిబుల్స్ ఉండాలి. నివాసప్రాంతంలో 40.00 నుంచి 55.00 ఉండాలి. నిశబ్ద ప్రాంతం 50.00 నుంచి 40.00 లోపు ఉండాలి.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

స్పెషల్ డ్రైవ్ నిర్వహించి శబ్ద కాలుష్యం చేస్తున్న 100 బుల్లెట్ వాహనాలను గుర్తించి వాహన దారులకు కౌన్సిల్లింగ్ ఇచ్చాం. ఆయా వాహనాల సైలెన్సర్లను వారి ద్వారానే తొల గించాం. జీవోఎంఎస్ నెం.172 ప్రకారం చర్యలు తీసుకుంటాం. వాహనదారులతో పాటు అధిక శబ్దము వచ్చే సైలెన్సర్లను అమ్మిన షాపులపైనా, బిగించిన మెకానిక్ షాపులపైనా చర్యలు తీసుకుంటాం. పోలీసులకు సహకరించండి. అధిక శబ్దాలు వచ్చే సైలెన్సర్లను నియంత్రించండి.

- మహ్మద్ నబీ, ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రాజమండ్రి



అదానీని అరెస్టు చేయాలంటూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

అదాని ఒప్పందాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

అదానీని తక్షణమే అరెస్టు చేయాలని, అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి.బేబిరాణి, నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు మాట్లాడారు. అంతర్జాతీయంగా మన దేశ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న అదానీని మోడీ ప్రభుత్వం వెనకేసుకు రావడం సమంజసంగా లేదన్నారు. హిడెన్ బర్గ్ రిపోర్ట్ వచ్చినప్పుడే అదానీ సంస్థలపై తగిన చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదన్నారు. గత వైసిపి ప్రభుత్వం అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలతో పాటు పోర్ట్‌లను కూడా దారాదత్తం చేసిందన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అదానీ మోసం బయటకు వచ్చిన నేపథ్యంలో అసెంబ్లీలో చర్చకు పెట్టి రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు వెల్లడించి ఉండాల్సిందన్నారు. నిజాయితీ గురించి పదేపదే మాట్లాడే చంద్రబాబు అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అదానీ కంపెనీలకు లాభాలు చేకూర్చేలా, రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు వేసేలా ఒప్పందాలు చేసిన ఉన్నతాధికారులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నాయకులు మలక వెంకటరమణ, చంద్రమళ్ళ పద్మ, నర్ల ఈశ్వరి, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాణి, అనపర్తి ఏడుకొండలు, జి.భూలక్ష్మి, ఆర్.తలుపులమ్మ, ఆర్.రమేష్, జి.శ్రీనివాస్, టి.వీరబాబు, వి.రామిరెడ్డి పాల్గొన్నారు.

హాల్ టిక్కెట్లు నిరాకరిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ



కలెక్టర్ షాన్‌మోహన్

ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య కారణంగా విద్యార్థులకు హాల్ టిక్కెట్లను నిరాకరిస్తే సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తప్పవని కలెక్టర్ షాన్‌మోహన్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధించడం చేయరాదని, ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికే అన్ని కళాశాలలకు యుఒ నోట్‌ను పంపించామని తెలిపారు. జిల్లాలోని పలు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు చెల్లించాలని ఒత్తిళ్లు తెస్తున్నట్లు, తరగతులకు హాజరు కానీయకుండా, హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా పరీక్షలకు హాజరయ్యేందుకు ఆటంకం కల్గిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ అందుకునే విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాలలకు నేరుగా విడుదల చేస్తామని, పాత బకాయిలను క్రమంగా చెల్లిస్తామని చెప్పిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి బలవంతపు ఫీజు వసూళ్లకు పాల్పడినా, హాల్ టికెట్లను ఇవ్వకుండా విద్యార్థుల పరీక్షలకు హాజరు కానీయకుండా ఆటంకం కలిగించినా సంబంధిత విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి ప్రచారం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి సోమవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. గత 25 సంవత్సరాలుగా ఉపాధ్యాయులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిపిఎస్ రద్దు కోసం శ్రీకాకుళం నుంచి విజయవాడ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించానని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో తాను ముందుంటానని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం పిడిఎఫ్‌తోనే సాధ్యమని అన్నారు. కాలేజీలో కాంట్రాక్టర్ లెక్చరర్ సంబంధించి క్రమబద్ధీకరణ జీవో నెంబర్ 114ను అమలు చేయాలని, అంతేకాకుండా ఎయిడెడ్ కళాశాలలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించడం మరియు బడ్జెట్లో నిధులు కేటాయింపు, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలోనూ పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టడం వంటి సమస్యలపై శాసనమండలిలో పోరాటం చేస్తానని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో అగ్రభాగాన ఉంటానని అన్నారు. ఈ పర్యటనలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కేరుప్రోలు హరిబాబు, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.



ఎ.మల్లవరం గురుకుల పాఠశాలలో ఓటర్లను అభ్యర్థిస్తున్న గోపిమూర్తి

32వ రోజుకు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

క్లాప్ వాహన డ్రైవర్లు చేపట్టిన ఆందోళన సోమవారంతో 32 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా డ్రైవర్ల ఉద్యమ శిబిరాన్ని మున్సిపల్ ఎంహెచ్‌ఒ సందర్శించి 2 రోజుల్లో వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని, ఆందోళన చెందవద్దని అన్నారు. కార్మికులు 32 ఆకారాన్ని చూపిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ అధికారులు 2 రోజుల్లో జీతాలు పడతాయని పలు దఫాలు ప్రకటించారని, కానీ ఆచరణలో అమలు కాలేదన్నారు. ఎంహెచ్‌ఒ ఉద్యమ శిబిరాన్ని సందర్శించి జీతాల కోసం మాట్లాడటం సంతోషకరమని, అదేరీతిలో జీతాలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్, ఇస్మాయిల్, దుర్గాప్రసాద్, శివ, వెంకటేష్, కుమార్, భైరవ స్వామి, దుర్గబాబు, శివ శ్రీను పాల్గొన్నారు.



వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

జీడి పిక్కల ఫ్యాక్టరీని తెరిపించేలా చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం

ఈనెల 16 న అర్ధాంతరంగా మూసివేసిన ఏలేశ్వరం మండలం చిన్నింపేటలోని ఇంటర్ స్నాక్ జీడి పిక్కల ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని జీడిపిక్కల పరిశ్రమ కార్మిక సంఘం కోరింఇ. సోమవారం ఆర్‌డిఎ శ్రీరమణిని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సంద్భంగా రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ 24 గ్రామాలకు చెందిన 409 మంది కార్మికులు పనిచేస్తున్న ఈ ఫ్యాక్టరీని యాజమాన్యం అర్ధాంతరంగా మూసివేయడంతో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఈ కార్మిక కుటుంబాలన్నీ పస్తులతో అవస్థలు పడుతున్నాయన్నారు. ఫ్యాక్టరీలను రాష్ట్రానికి రప్పించి అందరికీ ఉపాధి కల్పిస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఉన్న ఫ్యాక్టరీ మూతపడినందున వెంటనే ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. యాజమాన్యం ఫ్యాక్టరీని తెరవకపోతే ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ కార్మిక నాయకులు ఏలేశ్వరం తహశీల్దార్ ఆర్‌వి.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు కంట చక్రధర్, కర్రీ రాజా, కాకర ప్రసాద్, వనము దుర్గాప్రసాద్, ఎ రామదుర్గ, సిహెచ్ గోవింద్, వై రమేష్, జి.వీరబాబు పాల్గొన్నారు. అలాగే ఫ్యాక్టరీ వద్ద కార్మికులు చేస్తున్న ఉద్యమానికి సిపిఎం మద్దతు ప్రకటించింది. సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు సోమవారం ధర్నా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసి వేయడంతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. 9 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు పని కల్పించాలన్నారు.



పెద్దాపురం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు



ఏలేశ్వరంలో కార్మికులకు మద్దతు తెలుపుతున్న సిపిఎం నాయకులు

విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల చేస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమని దేవస్థానం ఛైర్మన్ ఐవి.రోహిత్ అన్నారు. సోమవారం సత్యదేవా జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేకరించిన రూ.10 వేలు విరాళానికి సంబంధించిన చెక్కును ఛైర్మన్, ఇఒ చేతుల మీదుగా సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను అభినందించారు. ఆపత్కాలంలో ఉన్న వారిని ఆదుకునేందుకు అందించే ముఖ్యమంత్రి సహాయ నిధికి విద్యార్థులు ప్రజల నుంచి విరాళాన్ని సేకరించడం అభినందనీయమని అన్నారు. ఇదే సామాజిక సేవా దృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ఛైర్మన్, ఇఒ

లింగ నిర్ధారణ పరీక్షలపై అప్రమత్తం

ప్రజాశక్తి - పెద్దాపురం

డివిజన్‌లో లింగ నిర్ధారణ పరీక్షలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ శ్రీరమణి అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిరోధ చట్టం అమలుపై సమీక్షా సమావేశం ఆర్‌డిఒ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి.సరిత మాట్లాడుతూ పెద్దాపురం రెవెన్యూ పరిధిలో 39 స్కానింగ్ సెంటర్లు పని చేస్తున్నాయని అన్నారు. వీటిలో 11 సెంటర్లు ప్రభుత్వ పరిధిలో పని చేస్తున్నాయని వివరించారు. గత 3 నెలల కాలంలో 39 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు అక్టోబర్, నవంబర్ నెలల్లో 6 స్కానింగ్ సెంటర్లపై స్టింగ్ (డెకాయ్) ఆపరేషన్‌లు జరిగాయన్నారు. డివిజన్ పరిధిలో ఎక్కడా లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ ఆదేశించారు. ఈ విషయంలో నిత్యం పర్యవేక్షణ అవసరమని, ఎక్కడా ఎటువంటి అశ్రద్ధ పెట్టకుబడా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎల్.అనూషారాయ్, డాక్టర్ పి.సత్యవంశీ, డాక్టర్ ఐ.సాయిరోహిత, డాక్టర్ జె.రాజేశ్వరి, న్యాయవాది కందుల వెంకటచలం, సత్యరవికుమార్, పళ్ళ వాసవి పాల్గొన్నారు.




సమీక్షా సమావేశంలో పాల్గొన్న వైద్యులు

ఇంటి పన్ను ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇంటి పన్ను ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డిఎల్‌పిఒ అన్నామణి ఆదేశించారు. సోమవారం ఆమె కోరంగి పంచాయతీలో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. పంచాయతీల అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. అందుకు అనుగుణంగా పంచాయతీల ఆదాయాన్ని పెంపుదల చేసుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల మంగేష్, పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న అన్నామణి

ఘనంగా వన సమారాధనలు


ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు

పాండవ గిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దాపురం - రాయ భూపాల పట్నం రహదారిలోని పామాయిల్ తోటలో కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్, వడ్డి సత్యనారాయణ, నీలం శ్రీను, కరణం అప్పారావు, చందు వీరబాబు, ప్రజానాట్య మండలి నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ, రొంగల వీర్రాజు, దారపురెడ్డికృష్ణ, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చింతల సత్యనారాయణ, తాడిచెట్టి గంగ పాల్గొన్నారు. అలాగే తూర్పు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ముప్పనవారి గాలి బంగాళాలో కార్తీక వన సమారాధన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గెడ్డం పెదకాపు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు చలపతి రామారావు, కార్యదర్శి కిలారి చంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ ఆకుల శ్రీను, సహాయ కార్యదర్శి పిన్నింటి రవి, కోశాధికారి సేనాపతి నవీన్ పాల్గొన్నారు. తాళ్ళరేవు మండలంలోని కేశవపురం భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శెట్టిబలిజ కార్తీక వన సమారాధన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన అన్నదానంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కమిటీ ప్రతినిధులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కార్టూ'నిజం'



బాల్య వివాహాల నివారణకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో బాల్య వివాహాల నివారణకు అధికారులంతా దృష్టి సారించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభు త్వం ఈనెల 27న బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, ఈ కార్యక్రమం కింద జిల్లా అంతట ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసేలా చూడాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పిజి ఆర్ఎస్ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టా త్మకంగా నిర్వహించనున్న బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమానికి సంబంధించి ప్రతిజ్ఞ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 27 ప్రారంభమై డిసెంబర్ 10 వరకూ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం కింద బాల్య వివాహాల నిర్మూలన, బాలల విద్య వంటి అంశాలపై వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుం దన్నారు. జిల్లా అంతట ప్రతి ఒక్కరు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల కళాశాల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కళాశాల బ్యాంకు ఖాతాలో జమ చేయనున్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని అన్ని కళాశాల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి జియో ట్యాగింగ్, ఎన్‌పిసిఎల్ బ్యాంక్ అకౌంట్‌కు అనుసంధానం చేయించడం, హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ వంటి అంశాలపై మండల స్థాయి ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్‌ఒ జె.వెంకటరావు, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్



విద్యుత్ శాఖ డిఇకి వినతిపత్రం ఇసుక్తన్న నాగేశ్వరరావు

ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలి


ప్రజాశక్తి - జగ్గంపేట

గత ప్రభుత్వాల్లో ఎస్‌సిలకు అమలైన ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగించాలని జగ్గంపేట నియోజకవర్గ బిఎస్‌పి ఇన్‌ఛార్జ్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యుత్ శాఖ డిఇని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎస్‌సిలకు 200 యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడిందని, జూన్ నెల నుంచి బిల్లులు చెల్లించేలా ఎస్‌సిలపై అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. తక్షణమే ఎస్‌సిలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్‌ను అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గోడపత్రిక కలకలం

ప్రజాశక్తి - పెదపూడి

వెలుగు ఎపిఎం చిన బాబుపై అవినీతి ఆరోపణలతో గోడ పత్రిక కలకలం రేపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 22వ తేదీన కరకుదురు పంచాయతీ కార్యాలయం వద్ద ఇదే రీతిలో గోడపత్రికను గుర్తు తెలియని వ్యక్తులు అంటించారు. మరోసారి సోమవారం పెదపూడి వెలుగు కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద శిలాఫలకంపై ఒక గోడపత్రిక వెలసింది. స్త్రీనిధి రుణంగా డ్వాక్రా సంఘాలకు రూ.5 లక్షల వరకూ మంజూరు చేసి, అందుకు ప్రతిఫలంగా సుమారు రూ.15 నుంచి రూ.20 వేల వరకూ ఎపిఎం వసూలు చేస్తున్నట్లు ప్రధాన ఆరోపణగా ఉంది. కాండ్రేగుల, రామేశ్వరం, కరకదురు తదితర గ్రామాల్లో కొంతమంది యానిమేటర్లతో చినబాబు సన్నిహితంగా ఉంటున్నట్లు, స్త్రీనిధి రుణం 23 వాయిదాలు చెల్లించాల్సి ఉండగా 24 వాయిదాలు కట్టించుకుంటున్నారని మరో ఆరోపణగా ఉంది. 2021 సంవత్సరం నుంచి ఒక్కో గ్రూపునకు సభ్యత్వ రుసుం పేరుతో రూ.2500 అక్రమంగా వసూలు చేస్తున్నారని, చినబాబు ఆదేశాలతోనే ఈ వసూళ్ల జరుగుతున్నాయని, ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేయించి చినబాబు అక్రమాలను నిగ్గు తేల్చాలని గోడపత్రికలో డిమాండ్ చేశారు.



వెలుగు కార్యాలయం వద్ద వేసిన గోడపత్రిక

పార్కులో ఏడాకుల చెట్లు తొలగించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని వివేకానంద పార్కులో ఉన్న ఏడాకుల చెట్లు తొలగించాలని డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. శీతాకాలంలో ఏడాకుల చెట్ల నుంచి విడుదలయ్యే పుప్పొడి రేణువులు గాలిలోకి వ్యాపించి శ్వాసకోస వ్యాధులు, ఉబ్బసం వంటి వ్యాధికి కారకంగా నిలుస్తుందన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఏడాకుల చెట్లను తొలగించాలన్నారు.

నేరాలు ఘోరాలు

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తొండంగి

అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగిన ఒక వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు ప్రకారం..మండలంలోని శృంగ వక్షం గ్రామానికి చెందిన బోయిన బాబూరావు(31) తన పొలంలో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు తునిలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి మెరుగు అవ్వకపోవడంతో అతనిని కాకినాడలోని మరో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆదివారం నుంచి చికిత్స అందించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

163 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని సోమవరం గ్రామంలో 163 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో సోమవరం గ్రామంలో తనిఖీలు నిర్వహించగా వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా 163 కేజీల గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విశాఖ ఏజెన్సీ నుంచి చెన్నైలోని గుమ్మిడిపొండి గ్రామానికి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రత్తిపాడు కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు. వీరిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించినట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 8 మందికి రూ.10 వేలు చొప్పున మెజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించినట్లు సిఐ సూర్య అప్పారావు తెలిపారు. ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

10 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జె.కొత్తూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో 8 మంది సారా ముద్దాయిలను గండేపల్లి తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని రామేశంపేటలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ వస్తున్న వారిని వ్యాన్ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగపతినగరం గ్రామానికి చెందిన తాటిపాక గంగరాజు(28) భార్య, పిల్లలతో రంగంపేట గ్రామంలోని కోళ్ల ఫారంలో నివాసం ఉంటున్నాడు. మధ్యాహ్నం తన కుమారుడు అనిల్‌ను ఆనూరు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా రామేశ్వరంపేట వైపు వస్తున్న వ్యాన్ ఢీ కొట్టింది. ద్విచక్రవాహనంపై ఉన్న బాలుడు రోడ్డు పక్కకు పడిపోగా గంగరాజు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గంగరాజు భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ నాగబాబు తెలిపారు.

ఆటో బోల్తా : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని ఎర్ర పోతవరం, శివల మెయిన్ రోడ్డుపై సోమవారం ప్రయాణికులతో వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. మెయిన్ రోడ్డుపై రైతులు ధాన్యం ఆర బెట్టుకున్నారు. ధాన్యం రాశులు తప్పించుకుంటూ వెళ్లిన ఆటో ప్రయాణికులతో బోల్తా పడింది. చిన్న పిల్లలతో పాటు పదిమంది ప్రయాణికులు ఉన్న ఆటో బోల్తా పడిన వెంటనే అక్కడే ఉన్న వ్యవసాయ కూలీలు పరుగున వెళ్లి ప్రయాణికులను బయటకు తీసి ఆటోను తీశారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు మినహా ఎవరికీ ఏ విధమైన ప్రమాదం జరగలేదు. రైతులు పెద్ద ఎత్తున తొలకరి ధాన్యాన్ని మెయిన్ రోడ్లపై ఎండబెట్టడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలకు దారి విడిచిపెట్టి ధాన్యం ఎండ పెట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముగ్గురు సారా విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు, మండపేట మండలాల్లో నాటు సారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సిఐ డి.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మడికి, బడుగువానిలంక, మండపేట మండలంలోని కేశవరం గ్రామాల్లో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో మడికికి చెందిన మార్గాన దుర్గారావు, బడుగువానిలంకకు చెందిన మారిశెట్టి లక్ష్మణరావు, కేశవరానికి చెందిన కడగల రాముడును అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మొత్తం 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. ఈ మేరకు సిఐ నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మ పేటకు చెందిన గుత్తుల రమ్యశ్రీ (24) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన రమ్యశ్రీకి వేగాయమ్మపేటకు చెందిన గుత్తు రాజుతో వివాహం అయ్యింది. వారికి ఒక బాబు ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన మేడిశెట్టి దుర్గా వరప్రసాద్‌తో చనువుగా ఉంటూ ఇంటిలోని బంగారం అతడికి ఇచ్చివేసింది. విషయం తెలిసిన భర్త, తండ్రి నిలదీయంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై ఆమె తండ్రి అనసూరి గనిరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామం ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

రైతులకు అదనపు ఆదాయం

ప్రజాశక్తి - సామర్లకోట



పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్

ఇండిగ్యాప్ పొలంబడి నిర్వహణతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని నవర గ్రామంలో ఇండి గ్యాప్ పొలంబడి క్షేత్ర దినోత్సవం కార్యక్రమం మండల వ్యవసాయధికారి ఇమ్మిడిశెట్టి సత్య అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా 14 వారాల్లో రైతులు నేర్చుకున్న వ్యవసాయ పద్ధతులు ఏ మేరకు ఉపయోగపడ్డాయి అనే అంశాలపై రైతులను వ్యవసాయ శాఖ జెడి అడిగి తెలుసుకున్నారు. పొలంబడి నిర్వహించే ముందు రైతులకు ప్రీ పొలంబడి టెస్ట్ నిర్వాహణ, 14 వారాలు పూర్తి అయిన తర్వాత పోస్ట్ ఎవాల్యూషన్ పొలంబడి టెస్ట్ నిర్వహించడం, ఈ రెండిటికి మధ్య వ్యత్యాసాలపై రైతులు ఎంతవరకూ అవగాహన తెచ్చుకున్నారని అనే అంశంపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండిగ్యాప్ పొలంబడి ఒక గ్రామంలో 30 మంది రైతులతో 25 ఎకరాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలుత రైతులతో బేస్ లైన్ సర్వే చేసి పొలంబడికి ముందు వారు వాడిన ఎరువులు, క్రిమి సంహారక మందులు వివరాలు నమోదు చేసుకుని, విత్తనశుద్ధితో మొదలు పంట కోత కోసే వరకూ 14 వారాల పంటకు అనుగుణంగా పొలంలోనే దానికి తగిన సాంకేతికతను జోడించి నూతన శాస్త్రీయ పద్ధతులను రైతులకు విపులంగా వివరించడం మరియు ప్రాక్టికల్ గా రైతులతో చేయించడం జరుగుతుందన్నారు. పొలంబడిలో ఈ ఏడాది 15 మంది రైతులతో ఆర్గానిక్ సర్టిఫికేషన్ రిజిస్ట్రేషన్ చేసినట్లు చెప్పారు. రైతు ఒక ఏడాది పాటు తను పండించిన ధాన్యాన్ని పూర్తిగా నాచురల్ ఫార్మింగ్ ద్వారా వచ్చిన బియ్యాన్ని తాను సొంతంగా అమ్ముకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. దీంతో రైతులకు గిట్టుబాటు ఆదాయం సమకూరుతుందన్నారు. ఇండి గ్యాప్ పొలంబడిలో 14 వారాలు క్రమం తప్పకుండా అధికారులు చెప్పినవన్నీ పాటించిన ముగ్గురు రైతులు వెన్నా వీర వెంకట సత్యనారాయణ, కేశవరపు సురేష్, పడాల వెంకట రమణ లను ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో కాకినాడ సహాయ సంచాలకులు ఎన్ రత్నప్రశాంతి, ఎఒ సత్య, మండల వ్యవసాయ అధికారి చీకట్ల సత్యనారాయణ, నవర ఎఇఒ గుడివాడ నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజారోగ్యం, పర్యావరణం, వీధిలైట్లు, మంచినీటి సరఫరా విభాగాల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కెవి పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శివకోటి అప్పారావు, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కెవి.రమణ మాట్లాడుతూ సకాలంలో కార్మికులకు రక్షణ పరికరాలు, పనిముట్లు ఇవ్వకపోవడంతో కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. వాహనాల మరమ్మతులు వెంటనే చేపట్టడం లేదన్నారు. కార్మికులకు యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోందన్నారు. చెత్త ఉత్పత్తి పెరుగుతుందని, అయినా కార్మికుల సంఖ్య పెరగటం లేదన్నారు. ఇంజనీరింగ్ విభాగం లో పనిచేసే వర్కర్లకు రూ.21 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధమైన వారాంతరపు సెలవులు, క్యాజువల్ లీవులు, జాతీయ సెలవులు పక్కాగా అమలు చేయాల న్నారు. సాధారణ, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాసిన భద్రరావు, స్వామి, తూతిక సాయి, బాపే భద్రరావు, భాస్కర్, నాగేశ్వరరావు, బషీర్, సతీష్, వర్రె గిరిబాబు, మడికి రమేష్, సురేష్, మోహనరావు, శేషారావు, సిఐటియు నాయకులు నీల పాలసూరిబాబు, డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని వ్యాప్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ



విద్యార్థులతో ఆర్‌జెడి నాగమణి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని అందరూ అనుసరిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని వ్యాప్తి చేయాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక గాంధీనగర్ మహాత్మ గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం కాకినాడ జోన్-2 పరిధిలో ఏడు జిల్లా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన, రాజ్యాంగం కోసం పరుగు, డిబేట్, దేశభక్తి గేయాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు జిల్లాలకు చెందిన 105 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత విజయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ నాయుడు వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం ఎస్ఎస్ఎస్. వెంకటేశ్వరరావు, విద్యాశాఖ సహాయక సంచాలకులు వివిఎస్ఎన్.మూర్తి, పర్యవేక్షకులు జె. కృష్ణార్జునచౌదరి, బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, కృష్ణశ్రీ పాల్గొన్నారు.

కళ్యాణ వేదిక ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మఠం సెంటర్ పొట్టి శ్రీరాములు పార్క్ సమీపంలో ఉన్న వీరభద్ర రామాలయానికి చెందిన కళ్యాణ వేదికను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ మాజీ ఛైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం సోమవారం ప్రారంభించారు. దాత మన్యం కుర్మానాథ్, డాక్టర్ వాణి దంపతులచే రూ.7 లక్షల వ్యయంతో కళ్యాణ వేదికను నిర్మించారు. ఈ సందర్భంగా దాతలను ఎంఎల్ఎ అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీశ్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, వల్లూరి దొరబాబు, నిమ్మకాయల కిరణ్, ఆలయ కమిటీ నాయకులు మారిన బుల్లి సత్తిరాజు, యార్లగడ్డ రామలింగ నాగేశ్వరావు, మలిరెడ్డి గాంధీ, మాసిన చిన్న, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, బిక్కిన సాయి పాల్గొన్నారు.

ఐటి సంస్థతో ఒప్పందం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో టెడ్‌లాన్స్ ఐటీ సొల్యూషన్స్ సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవరపల్లి చెన్నారావు మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా టెడ్ లాన్స్ ఐటి సంస్థ కళాశాల విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ, పైథాన్, క్లౌడ్ కంప్యూటర్ వంటి అంశాలపై ఇంటర్న్‌షిప్ సహకరిస్తుందన్నారు. టెడ్ లాన్స్ సంస్థ సిఇఒ రామదేవు రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత గ్లోబల్ యుగంలో ఉద్యోగాలను సాధించడానికి డిగ్రీతో పాటు నైపుణ్యాలు చాలా అవసరమని, విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడానికి ఇంటర్న్ షిప్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్న్ షిప్ కో ఆర్డినేటర్ వారణాసి మల్లికార్జున శర్మ, ఐక్యూఎసి కో ఆర్డినేటర్ డాక్టర్ పివివి. సత్యనారాయణ, కో ఆర్డినేటర్ విశ్వేశ్వర్, ఝాన్సీదేవి, దేవిప్రసన్న పాల్గొన్నారు.

పంట కాలువ పూడ్చివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పెద్దాపురం

6 గ్రామాల ఆయకట్టుకు సాగునీరందించే చాగల్నాడు పంటకాలవ పూడ్చివేతపై రైతు సంఘం నాయకుడు పుట్టా సోమన్న ఆధ్వర్యంలో రైతులు ఆర్‌డిఒ శ్రీరమణికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ గండేపల్లి మండలం నాయకంపల్లి వద్ద ఒక రైతు 500 మీటర్ల పొడవున చాగల్నాడు కాలువను పూడ్చి వేయడంతో సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చాగల్నాడు పంట కాలువ ద్వారా 6 గ్రామాలకు చెందిన 5 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కాలువను పూడ్చడం వల్ల గండేపల్లి, రంగంపేట మండలాలకు చెందిన పొలాలకు సాగునీరందక రైతులు నష్టపోతున్నారన్నారు. ఒక రైతు చేసిన పనికి ఎందరో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. దీనిని పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని ఆర్‌డిఒ రైతులకు హామీ ఇచ్చారు.

ప్రయివేటు ఆర్ఒ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

విచ్చలవిడిగా నిర్వహిస్తున్న ప్రయివేట్ ఆర్ఒ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, కుంచే నానిబాబు డిమాండ్ చేశారు. సోమవారం సామర్లకోట మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న మంచినీళ్లలో నాణ్యత లేకపోవడంతో ప్రజలు ప్రయివేటు ఆర్ఒ ప్లాంట్‌లపై ఆధారపడుతున్నారని అన్నారు. దీంతో ఎక్కడ పడితే అక్కడ ఆర్ఒ ప్లాంట్లను ఏర్పాటు చేస్తూ, బోర్ వాటర్‌ను పూర్తిస్థాయిలో శుద్ధి చేయకుండానే ఇష్టారాజ్యంగా ధరలను నిర్ణయించి విక్రయాలు చేస్తున్నారని వివరించారు. తక్షణమే ప్రయివేటు ఆర్ఒ ప్లాంట్ అనుమతులను పరిశీలించి, వాటర్ ప్లాంట్‌లో నిబంధనలకు అనుగుణంగా నీటి శుద్ధి జరుగుతుందా? లేదా అనే అంశాలపై పరీక్షలు నిర్వహించాలని కోరారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ యువి.శివనాగబాబు అన్నారు. సోమవారం మండలంలోని మల్లేపల్లి హైస్కూల్‌లో జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు, చెడు వ్యసనాలు, రోడ్డు ప్రమాదాలు బారిన పడకుండా ఎలా రక్షించుకోవాలి అనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుధామాధురి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామయ్య జయంతి

ప్రజాశక్తి - గండేపల్లి

ఆంధ్రబ్యాంకు వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని జడ్ రాగంపేట యూనియన్ బ్యాంక్ ఆవరణలో బ్యాంకు మేనేజర్ కె.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు పాల్గొని భోగరాజు పట్టాభి సీతారామయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1923వ సంవత్సరంలో తెలుగువారికి ఒక బ్యాంకు ఉండాలనే లక్ష్యంతో ఆంధ్రా బ్యాంక్‌ను స్థాపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రవిచంద్ర, ఆర్.విజయ్‌కుమార్, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

దాతల సాయంతో అన్న క్యాంటీన్

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రతి సోమవారం స్థానిక ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహం వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో కొయ్యన ఉమామహేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి కొయ్యన లక్ష్మి, కుమారుడు రోహిత్ యాదవ్ ఆర్థిక సహాయంతో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, ఎస్‌విఎస్.అప్పలరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, తెలుగు యువత ఉపాధ్యక్షులు బద్ది సురేష్, వేములకొండ జోగారావు, ఒమ్మి శ్రీనివాస్, ఒమ్మి యనోష్ కుమార్, ఈగల సత్యవతి, బొబ్బిలి విజయ, మారిశెట్టి గంగ, తుమ్మల కిషోర్, ప్రేమ స్వరూప్ బుజ్జి పాల్గొన్నారు.

వేమగిరి ఇసుక పాయింట్‌లో ఆర్‌డిఒ తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ జిల్లాకు కేటాయించిన వేమగిరి ఇసుక పాయింటును సోమవారం రాత్రి ఆర్‌డిఒ శ్రీరమణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రోజుకు ఎన్ని మెట్రిక్ టన్నులు ఇసుక సరఫరా జరుగుతున్నది, ప్రస్తుత ఇసుక ఛార్జీలు, ఒక వెహికిల్ ఇసుక లోడ్ చేయడానికి ఎంత సమయం పడుతుంది? తదితర విషయాలను విధుల్లో ఉన్న విఆర్‌ఒను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు.

29న జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి - పిఠాపురం

ఈనెల 29న శుక్రవారం మధ్యాహ్నం 2గంటల నుంచి పట్టణంలోని ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ క్రీడా ప్రాంగణంలో జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించనునట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ బాయ్స్, గర్ల్స్ ఓపెన్ ఛాంపియన్షిప్, సీనియర్ మెన్ అండ్ ఉమెన్ సెలక్షన్ కమ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీనియర్స్ పోటీలో పాల్గొన్న వాళ్లు మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఇండియన్, కాంపౌండ్ రౌండ్లో స్త్రీ, పురుషులు విభాగాల్లో జరుగుతాయన్నారు. ఈ పోటీలో పాల్గొనేవారు ఆధార్, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్‌లను తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 9989001162 సంప్రదించాలన్నారు.

వన మహోత్సవాల సందడి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ములగపూడిలో సర్పంచ్, టిడిపి మండల అధ్యక్షులు తమరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. అలాగే రౌతులపూడిలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, శ్రీను వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా దీపాల సంబరం

ప్రజాశక్తి - కరప

కరప పాత విజయ బ్యాంక్ సెంటర్‌లో సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవం ఘనంగా ప్రారంభించారు. పిఠాపురం శ్రీపాద శ్రీ వల్లభ సంస్థానం కార్య నిర్వహణ అధికారి సౌజన్య దీపోత్సవాన్ని ప్రారంభించారు. కార్తీక దామోదరునికి పూజలు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి కోటి దీపోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కరప ఎస్ఐ డి.సునీత, ఎఎస్ఐ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో వర్షిత ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట


తల్లిదండ్రులతో విజేత వర్షిత

సామర్లకోట విశాలాక్షి నగర్‌కు చెందిన చిన్నారి వర్షిత లక్ష్మీపద్మావతి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కరాటేలో ఉత్తమ ప్రతిభ కనపరచింది. అనంతపురంలో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్ 14/17 గర్ల్స్ ఛాంపియన్ షిప్ పోటీలో సత్తా చాటి తృతీయ స్థానంలో నిలిచింది. స్థానిక భాష్యం పాఠశాలలో 6వ తరగతి చదువుతుంది. సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్షితని కోచ్ శంకర్, భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ సూర్యారావు, వైస్ ప్రిన్సిపల్ శిరీష, సన్ షైన్ డిఎస్‌సి, పిఇటి కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ ఎండి. ఇబ్రహీం, తల్లిదండ్రులు సూర్య ఉదయభాస్కర్, శ్రీదేవి అభినందించారు.

వరి పొలాల పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడ, చందుర్తి గ్రామాల్లో వరి పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. రైతు సేవ కేంద్రం నుంచి ఎపి సీడ్ సంస్థ ద్వారా సరఫరా చేసిన ఆర్‌జెఎల్ 2537 వరి రకంను రైతులు సాగు చేశారు. అయితే పంట ఆఖరి దశలో కేలీలు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం మండల వ్యవసాయ అధికారి కెవివి.సత్యనారాయణ, ఎపి సీడ్ సంస్థ ప్రతినిధి ఎం.గంగాధర్, విత్తన అభివృద్ధి సంస్థ కనకమహాలక్ష్మి సీడ్స్ ప్రతినిధి కె.మణికంఠ వరి పొలాలను పరిశీలించారు. కేలి వల్ల నష్టపోయిన పంటకు నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు.

యానాం వార్తలు

రీజెన్సీ విద్యార్థినికి వెండి పతకం

ప్రజాశక్తి - యానాం


వెంకటపద్మజభారతి

రామచంద్రాపురంలో నిర్వహించిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో స్థానిక మెట్టకూరు రీజెన్సీ స్కూల్ విద్యార్థిని నాగభట్ల వెంకటపద్మజభారతి ఘన విజయం సాధించి వెండి పతకాన్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు సోమవారం తెలిపారు. విద్యార్థిని పద్మజ భారతి ఏడవ తరగతి చదువుతుందని వివరించారు. ఈ సందర్భంగా రీజెన్సీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జిఎన్.నాయుడు, సత్యేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

మృతుని కుటుంబానికి రూ.5 లక్షల మంజూరు

ప్రజాశక్తి - యానాం



చెక్కును అందిస్తున్న మునిస్వామి

ఇటీవల ఆటో ప్రమాదంలో మృతి చెందిన సంగాడి వెంకట నరసింహస్వామి కుటుంబానికి పుదుచ్చేరి ప్రభుత్వం పిఎం మత్స్య సంపద యోజన పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు మత్స్యశాఖ అధికారి డి.గొంతియ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి భార్య సంగాడి కాసురత్నంకు మంజూరు పత్రాన్ని ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి చేతుల మీదుగా అందించారు.

3న యానాంలో యువ ఉత్సవ్

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యం లో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని డిసెంబర్ 3న నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి తిర్రి గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవ్ కార్యక్రమాన్ని స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో జరుగుతుందన్నారు. యువ ఉత్సవ్‌లో ఇండియాఎ 2047 అనే అంశంపై పెయింటింగ్, కవిత్వాలు, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్, విభాగాలలో వ్యక్తిగత పోటీలు, అలాగే కల్చరల్ ట్రెడిషనల్ ఫోక్ (గ్రూప్), సైన్స్ ఎక్జిబిషన్ మేళా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. యానాంలోని యువత పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. యువ ఉత్సవ్‌లో పేర్లు నమోదు చేసుకోవడానికి 9700515436, 7095466771 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

వైసిపిని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి


ముద్రగడకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైసిపి నాయకులు

నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేయాలని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గ వైసిపి నాయకులు మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం, తనయుడు గిరిబాబును కిర్లంపూడిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో ప్రభుత్వంపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. జగన్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని అన్నారు. తక్షణమే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి కాశి, ముద్రగడ వీరేంద్ర, సామంతుల సూర్యకుమార్, పైలా విజయ్, గోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.